విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 21: జిల్లా కేంద్రంలోని ద్వారక నగర్ కాలనీలో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల అంజనేయులు, కౌన్సిలర్ సులోచన ప్రభురెడ్డి పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

రామాయంపేట, నవంబర్ 21: రామాయంపేటలోని బాలాజీ గార్డెన్‌లో జరిగిన ఓ పెళ్లికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై వధూవరులను గురువారం ఆశీర్వదించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న తండావాసులు

చిలిపిచెడ్, నవంబర్ 21: మండలంలోని బద్రియ గిరిజన తండాలో తాగు నీటి కోసం తండావాసులు ఖాళీ బిందెలతో గురువారం రోడ్డెక్కారు. మెదక్ – సంగారెడ్డి ప్రధాన రోడ్డుపై ఖాళీ బిందలతో నిరసన తెలిపారు. నీటి సమస్య గురించి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గిరిజనుల జోలికి వస్తే సహించేది లేదు

టేక్మాల్, నవంబర్ 21: గిరిజన ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ భూములను అక్రమంగా లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని జిల్లా బంజారా సేవాలాల్ సంఘం అధ్యక్షుడు రమేశ్‌నాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం టేక్మాల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన అల్లుడి కోసం ఫార్మా కంపెనీ ఏర్పాటుకు లగచర్ల గిరిజనుల భూములను అక్రమంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నేనావత్ చంద్రశేఖర్, గిరిజన నాయకులు రెడ్యానాయక్, రాజు నాయక్, సురేష్ నాయక్, సుభాష్ నాయక్, తదితరులు ఉన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

అల్లాదుర్గం, నవంబర్ 21: విద్యార్థి దశలోనే మూఢ నమ్మకాలను విడనాడాలని సీఐ రేణుకారెడ్డి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యుడు నరేశ్ తెలిపారు. గురువారం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం– మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భరోసా కేంద్రం శ్రీలత, సౌమ్య, ప్రత్యేక అధికారి స్రవంతి, హెడ్‌కానిస్టేబుల్ సికిందర్, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో వాలీబాల్, త్రోబాల్ పోటీలు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 21: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈషా గ్రామోత్సవం పేరిట ఈ నెల 23, 24 తేదీల్లో వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి దామోదర్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. చిన్నశంకరంపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రాంగణంలో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 83000 30999, 99667 32612లలో సంప్రదించాలని సూచించారు.

ఎంట్రీల ఆహ్వానం

టేక్మాల్, నవంబర్ 21: ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీలో ఎంట్రీకి ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బొంపల్లి మధుసూదన్ తెలిపారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొంపల్లి రాజయ్య స్మారక ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీని డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తికగల క్రీడాకారులు ఈనెల 30వ తేదీలోపు జట్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 98662 46548, 76748 88770, 70364 70928, 94417 63329 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఫ్లోర్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వాణికుమారి

చిన్నశంకరంపేట, నవంబర్ 21: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ చిన్నశంకరంపేట మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు వర్షిక, స్రవంతి, శ్రావణి ప్రతిభను కనబరిచి ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ వాణికుమారి, పీడీ బస్వరాజ్, తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న మల్లికార్జున్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 21: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రెండ్లీ ప్రభుత్వం అంటున్న రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఒక్క సమస్య పరిష్కరించలేదన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్‌రెడ్డి, మల్లేశం, నర్సమ్మ, నాగరాజు, గౌరి పాల్గొన్నారు.


చిన్నశంకరంపేట: కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్డీఏ వీడి శ్రీనివాస్‌రావు

కొల్చారంలో రోడ్డు పై ధాన్యం లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ మహమ్మద్ గౌస్

దళారులకు విక్రయించి మోసపోవద్దు

- గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు

తరుగు పేరిట దోపిడి చేస్తున్న రైస్‌మిల్

చిన్నశంకరంపేట, నవంబర్ 21: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. ఐకేపీ ఆధ్వర్యంలో సూరారం వెంకట్ రావ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ, సీసీ యశోద తదితరులున్నారు. పాపన్నపేట, నవంబర్ 21: తరుగు పేరిట దోపిడీకి పాల్పడుతున్న రైస్‌మిల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీ నగర్ శివారులోని దత్త సాయి రైస్‌మిల్‌లో నార్సింగ్ గ్రామానికి చెందిన రైతు వద్ద 2.70 క్వింటాళ్ల తరుగు తీసినట్లు ఆరోపించారు.

త్వరగా అన్‌లోడింగ్ చేయండి

మిల్లర్లు ధాన్యం లారీలను త్వరగా అన్‌లోడ్ చేయాలని ఎస్ఐ మహమ్మద్ గౌస్ అన్నారు. కొల్చారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, సత్యసాయి రైస్ మిల్‌ను సందర్శించారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

నర్సాపూర్, నవంబర్ 21: ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని తహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చిన్నచింతకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సందర్శించారు. ఏపీఎం గౌరీశంకర్, ఆర్ఐ సిద్దిరాంరెడ్డి, సీసీ, సీఏ పాల్గొన్నారు.

అనేక ఆంక్షల నడుమ సన్నాల కొనుగోళ్లు

కొల్చారం, నవంబర్ 21: అనేక ఆంక్షల నడుమ ఎట్టకేలకు ప్రభుత్వం సన్నాల కొనుగోళ్లు ప్రారంభించింది. ధాన్యం కోసి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు లేక సన్నరకం వడ్ల కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. గురువారం కొల్చారంలో సన్న రకం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏఈవో వినితా భవానీ ధాన్యానికి కొలతలు వేసి నిర్ధారించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మనోహర్, నిర్వాహకులు బిట్ల నర్సింహులు, రైతులు వెంకటేశం, శేకులు, నింగోల్ల శ్రీను, బాణయ్య, సంజీవులు, రాములు ఉన్నారు.

రైస్‌మిల్ యాజమాన్యం చేతిలో నష్ట పోయిన రైతులు

కొల్చారం: సన్నరకం ధాన్యానికి కొలతలు వేస్తున్న ఏఈవో

నర్సాపూర్: చిన్నచింతకుంటలో పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆర్థిక సాయం అందజేస్తున్న పరంజ్యోతి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట, నవంబర్ 21: చేగుంటకు చెందిన అగల్‌దివిటి పెంటోజీకి అయిత పరంజ్యోతి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కటికే రాజేశ్, బచ్చుల సంతోష్, కాసం శంకర్, రమేశ్‌గౌడ్, ఆరెకటిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

చేగుంట, నవంబర్ 21: చేగుంట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బుర్క నాగరాజు, రజనక్ రాంచంద్రం ఆధ్వర్యంలో కంటి జబ్బులతో బాధపడుతున్న పలువురిని ఆపరేషన్లకు తరలించారు.

దాబాలో మత్తు పదార్థాల విక్రయం

దాబాలో మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

వెల్దుర్తి, నవంబర్ 21: మాసాయిపేట మండల శివారు 44వ జాతీయ రహదారిపై ఉన్న షేర్ ఈ పంజాబీ దాబాలో మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి గురువారం దాడులు నిర్వహించారు. 128 గ్రాముల పాప్పీస్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. హెరాయిన్ తయారీలో ఈ పౌడర్‌ను వాడతారన్నారు. దాబా నిర్వాహకులు రవీందర్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించనున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

కౌడిపల్లి, నవంబర్ 21: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నాగుసాన్‌పల్లి గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోర్పోల్ కృష్ణ (24) కుటుంబం విషయంలో కొన్ని రోజులుగా దిగులుగా ఉంటూ, ఈనెల 19న తన పొలంలో పురుగుల మందు తాగాడు. అతడిని నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా గురువారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రేగోడ్, నవంబర్ 21: నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మితో సహకారమని తహసీల్దార్ నరేశ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో 62 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీ శేషారెడ్డిని సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, నవంబర్ 21: సీఎంఆర్ఎఫ్ చెక్కులు పేదలకు వరంలా మారాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స చేయించుకుని ఆర్థిక సాయం కోసం ప్రభుత్వానికి విజ్ఞాప్తి చేసుకున్న నవాబ్ పేట గ్రామానికి చెందిన దివ్యభారతికి రూ.60 వేలు, సీహెచ్ నరేశ్‌కు రూ.28,500 చెక్కులను గురువారం ఎమ్మెల్యే అందజేశారు. ఆమె వెంట నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, గూడూరు యాదాగౌడ్, మాజీ సర్పంచ్ ఏనుగు అశోక్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రభుదాస్, చెన్నాపూర్ ప్రభాకర్‌రెడ్డి, గోమారం నర్సింహారెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమ్, సత్యంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందాపూర్ తండాలో..

సూరారం మాందాపూర్ గిరిజన తండాలో కాంగ్రెస్ మెదక్ ఎమ్మెల్యే రోహిత్ సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.

ఆపరేటర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి

- అదనపు కలెక్టర్ నగేశ్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ): సమగ్ర సర్వే క్వాలిటీ డేటా ఎంట్రీ ప్రధాన లక్ష్యంగా 516 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణనిచ్చినట్లు అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సామాజిక ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వే డేటా ఎంట్రీపై సంబంధిత మండల అభివృద్ధి, మండల ప్రత్యేక అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వే కంప్యూటర్ ఆపరేటర్లు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. చిన్న పొరపాట్లకు తావివ్వకుండా క్వాలిటీ డేటా ఎంట్రీ ప్రధాన లక్ష్యంగా ప్రణాళిక ప్రకారం ఎంట్రీ చేయాలని ఆపరేటర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, ముఖ్య ప్రణాళికాధికారి బద్రీనాథ్, సంబంధిత ఎంపీడీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు సహకరించండి

రామాయంపేట, నవంబర్ 21: సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని రామాయంపేట మాజీ సర్పంచ్ పల్లె రాంచందర్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో మేనేజర్ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎన్యూమరేటర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా చెకుముకి సైన్స్ పోటీలు

నిజాంపేటలో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో యాదగిరి

చేగుంటలో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో నీరజ

నిజాంపేట, నవంబర్ 21: నిజాంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలను గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో యాదగిరి హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మహేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట, నవంబర్ 21: విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో నీరజ తెలిపారు. చేగుంటలో మండల స్థాయి చెకుముఖి పోటీలునిర్వహించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో చేగుంట జడ్పీహెచ్ఎస్, ఆదర్శ పాఠశాల, శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రఘుపతి, నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నాగ్‌సాన్‌పల్లి, కుర్తివాడకు ప్రథమ స్థానం

పాపన్నపేట, నవంబర్ 21: మండల స్థాయి చెకుముకి పోటీల్లో నాగ్‌సాన్‌పల్లి, కుర్తివాడ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మోహన్ రావు తెలిపారు. గురువారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, హెచ్ఎం వెంకటేశం ఉన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 21: రామాయంపేటలో చెకుముకి పోటీల్లో ప్రగతి ధర్మారం విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ప్రథమ స్థానం సాధించిన ప్రగతి ధర్మారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సంగీత, అక్షయ, మనికుమార్‌ను హెచ్ఎం జయపాల్‌రెడ్డి, సైన్సు ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, దేవరాజ్ గౌడ్, రాజేశ్వరశర్మ, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, మంజుల, వేణు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీశైలం, సుమన్, కిరన్‌లు విద్యార్థులను అభినందించారు.

శివ్వంపేటలో చెకుముకి పోటీలు

శివ్వంపేట, నవంబర్ 21: శివ్వంపేట జడ్పీ హెచ్ఎస్‌లో చెకుముఖి పోటీల్లో మొదటి స్థానంలో గోమారం జడ్పీహెచ్ఎస్, ద్వితీయ స్థానం పెద్దగొట్టిముక్ల జడ్పీహెచ్ఎస్ నిలిచాయి. ఇంగ్లిష్ మీడియంలో ప్రథమస్థానం చిన్నగొట్టిముక్ల, ద్వితీయ స్థానం కొంతాన్‌పల్లి పాఠశాలలు నిలిచాయి. విజేతలకు ఎంఈవో బుచ్యానాయక్ బహుమతులు అందజేశారు.

వెల్దుర్తిలో చెకుముకి

వెల్దుర్తి, నవంబర్ 21: వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి పోటీలను గురువారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం సాంబయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, విజయభాస్కర్ రెడ్డి, చార్లెస్, జన విజ్ఞాన వేదిక సభ్యులు చందర్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో ప్రథమ స్థానం సాధించిన ముగ్గురు విద్యార్థులు

వెల్దుర్తిలో గెలుపొందిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

దివ్యాంగుల పింఛన్లు పెంచాలి

మాట్లాడుతున్న అడివయ్య

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 21: దివ్యాంగుల పింఛన్లు రూ.6 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని జాతీయ మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో జాతీయ మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ముత్యాలు అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు యశోద, చంద్రం, యాదగిరి, సంతోష్, కిష్టయ్య, రఘు, శివకుమార్, పెంటయ్య పాల్గొన్నారు.

లాలూచీ పడ్డామనడం దారుణం

నర్సాపూర్ పోలీస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

నర్సాపూర్, నవంబర్ 21: భూమి విషయంలో లాలూచీ పడ్డామని సీఐ అనడం దారుణమని నారాయణపూర్ గ్రామం లచ్చిరాంతండాకు చెందిన దేవిసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తండాకు చెందిన గిరిజనులు నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. కబ్జాలో ఇమ్మడి శ్రీనివాస్ ఉన్నాడని సీఐ చెప్పాడని, ఇది నిరూపించాలని డిమాండ్ చేశారు.

విశ్రాంత ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలి

నర్సాపూర్, నవంబర్ 21: విశ్రాంత ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు గుండం మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కమ్యూటేషన్ వాల్యూ ఆఫ్ పెన్షన్ రికవరీ నిలుపుదలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి విక్రేతల బైండోవర్

రామాయంపేట, నవంబర్ 21: మండలంలోని వడియారం జాతీయ రహదారిపై ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్సు సీఐ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎండు గంజాయి విక్రయాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం రాత్రి పట్టుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అంజురూల్‌షేక్, రహీం షేక్‌ల వద్ద నుంచి రెండున్నర కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ ఎస్సై విజయ్‌సిద్దార్థ, తహసీల్దార్ రజినీకుమారి ఎదుట వారిని బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు పుట్టి రాజు డిమాండ్ చేశారు. గురువారం మత్స్యశాఖ ప్రపంచ దినోత్సవం సందర్భంగా రామాయంపేటలోని మెదక్ చౌరస్తాలో ముదిరాజ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు.

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

మెదక్ రూరల్, నవంబర్ 21: చెకుముకి సంబురాల పోస్టర్‌ను మండలంలోని రాజ్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈవో నీలకంఠం గురువారం ఆవిష్కరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అగ్నిప్రమాదంలో కాలిపోయిన వస్తువులు

చిన్నశంకరంపేట, నవంబర్ 21: మండలంలోని ఖాజాపూర్‌కు చెందిన యాదమ్మ ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఇంట్లోని దుస్తులు, నిత్యావసర సరుకులు, రూ.40వేల నగదు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి తమను ఆదుకోవాలని ఆమె వేడుకున్నది.

స్టార్టర్ సెట్ చోరీ

చిన్నశంకరంపేట, నవంబర్ 21: స్టార్టర్ సెట్‌ను దొంగలించిన ఘటన మండలంలోని ధర్పల్లిలో గురువారం జరిగింది. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఉన్న త్రీఫేజ్ మోటర్ స్టార్టర్ సెట్‌ను దుండగులు దొంగలించారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతి అదృశ్యం

భాస్క శ్రావణి

రేగోడ్, నవంబర్ 21: యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చౌదర్‌పల్లిలో గురువారం జరిగింది. ఎస్సై పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బస్కు సాయిలు కూతురు భాస్క శ్రావణి ఈనెల 8న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కూతురు గురించి చుట్టుపక్కలా, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు రేగోడ్ పోలీస్‌స్టేషన్ నెంబరు 8712657926కు ఫోన్‌చేసి తెలపాలని ఎస్సై పేర్కొన్నారు.